## సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబిహా బేగం

అల్లాపూర్,మే 14: స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని అల్లాపూర్ కార్పొరేటర్ సబియా బేగం అన్నారు. బుధవారం వివిధ కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్, స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ నగర్‌లో తరచూ మాన్‌హోల్స్ పొంగి పొర్లుతున్నాయని, దుర్వాసన వస్తున్నదని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్.. జలమండలి సిబ్బందిని పిలిపించి మాన్‌హోల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

# నేటి తరానికి మార్గదర్శకులుగా నిలువాలి

కుత్బుల్లాపూర్, మే 14: నేటి తరానికి సీనియర్ సిటిజన్ మార్గదర్శకులుగా నిలువాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 132 – జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వర కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా రూపొందించిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లెటర్‌హెడ్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడు సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి పి.ఎన్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, సంయుక్త కార్యదర్శి నరసింహారెడ్డి, కోశాధికారి రామచంద్రయ్య, సలహాదారులు ఆంజనేయులు, రామచందర్, వెంకటరమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను కలిసిన వెంకటేశ్వర కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

## ఏఈ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే పరామర్శ



వైద్యశాలలో శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 14 : బాలాజీ నగర్, కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ ఇంజినీరింగ్ ఏఈ శ్రీనివాస్‌ను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. మూసాపేట సర్కిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న శ్రీనివాస్ గుండెపోటుతో వైద్యశాలలో చేరగా చికిత్స పూర్తయింది. కాగా బుధవారం ఎమ్మెల్యే మియాపూర్ లోని పల్స్‌హార్ట్ వైద్యశాలకు వెళ్లి శ్రీనివాస్ ఆరోగ్య విషయాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు ఏఈ శ్రీనివాస్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్, ఎస్ఈ చిన్నారెడ్డి , అధికారులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

### సరస్వతి పుష్కరాలకు
## ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బాలానగర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి తెలిపారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు పుష్కరాల నేపథ్యంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్లే భక్తులకోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఏదైనా కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే వారికోసం బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8919493417 లో సంప్రదించాలని సూచించారు.

జీడిమెట్ల : కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలో జరిగే సరస్వతిదేవి పుష్కరాలకు ఆర్టీసీ నుంచి 15 నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. 15 నుంచి 26 తేదీ వరకు గండిమైసమ్మ, అపురూప కాలనీ , జగద్గిరిగుట్ట స్పెషల్‌మెట్రో, డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. పెద్దలకు రూ.820, పిల్లలకు రూ.420 ఉంటుందని బస్తీ నుంచి 35 నుంచి 40 మంది ఉంటే, 20 నుంచి 10 మంది గ్రూపులుగా ఉన్నా డీఎం 99592 26150, సూపర్‌వైజర్ 73828 17481కు తెలియజేస్తే బస్సును ఆయా ప్రదేశాలకు పంపిస్తామని తెలిపారు.

## పిల్లల ఆటవస్తువులు ఏర్పాటు చేయాలి



కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీ కాలనీ : కేపీహెచ్‌బీ కాలనీ 6వ పేజ్ పీవీఎన్ఆర్ పార్కులో చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కోరారు. బుధవారం జడ్సీ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ ఆరో పేజ్ లోని పీవీఎన్ఆర్ పార్కులో నిత్యం వేలాది మంది చిన్నారులు, మహిళలు, యువకులు వస్తుంటారని, చిన్నారుల కోసం ఆట వస్తువులు ఏర్పాటు కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు ప్రసా ద్, ఫణికుమార్ పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ కాలనీ : బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కేపీహెచ్‌బీ కాలనీ సీఐ రాజశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ జానయ్య అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీ 7వ పేజ్ లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. వేసవికాలంలో తరచుగా నీటిని తాగి ఆరోగ్యంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మౌనిక రెడ్డి, కాలనీవాసులు బసవి అంజిబాబు, బత్తుల హరిబాబు, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, ఫణిపాల్, రవీందర్ యాదవ్, అనిల్, నరసింహులు పాల్గొన్నారు.




## సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



బాలానగర్ : సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ఆశ , జలమండలి ఏఈ సతీశ్, రాజీవ్‌గాంధీ నగర్ అధ్యక్షుడు నరేశ్, అరబ్, మోయిస్, వినోద్, అన్వేష్ పాల్గొన్నారు.



## డివిజన్ అభివృద్ధికి కృషి

బాలానగర్ : డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ అన్నారు. బుధవారం ఇందిరా గాంధీ పురంలో రూ.15 లక్షల నిధులతో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఫతేనగర్ డివిజన్‌లో ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై స్పందించి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో గౌస్, సలీం, సంతోష్ పాల్గొన్నారు.

## ఏడోరోజూ.. యజమానుల నిరసన దీక్ష



మాదాపూర్ : హఫీజ్‌పేట్‌లోని జనప్రియ నగర్ ఫేజ్ – 5లో ప్లాట్ యాజమానులు శేరిలింగంపల్లి జోనల్ ఆఫీస్‌తో పాటు చందానగర్ జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఏడు రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నారు. అంబేద్కర్‌నగర్ వాసుల అక్రమాలను నిరసిస్తూ బుధవారం దీక్ష చేయడంతో పలు పార్టీల నాయకులు సంఘీభావం పలికారు. ఫేజ్ – 5 ప్లాట్ యాజమానులు, మహిళలు పెద్దఎత్తున హాజరై దీక్ష చేపట్టారు. అధికారులు అంబేద్కర్‌నగర్ వాసులతో కుమ్మక్కై అన్యాయం చేశారని వాపోయారు. ఇప్పటికైనా ఫేజ్ – 5 స్థలాన్ని సర్వేచేసి మార్కింగ్ చూపించాలని కోరారు.

## మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి




దుండిగల్, మే 14 : ముథోలులో బుద్ధుడి విగ్రహం తొలిగించి, దళితుల మీద దౌర్జన్యం చేసిన మతోన్మాదులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ల బాలపీరు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ముథోలులో దళితులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కమిటీ ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మతోన్మాదంతో బీజేపీ ఎమ్మెల్యే అండతో దళిత మహిళలపై రాళ్లతో రువ్వి, కర్రలతో కొట్టి దౌర్జన్యానికి పాల్పడ్డారని మహిళల తలలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. అక్రమ కేసులు పెట్టి రిమాండ్ చేశారని విమర్శించారు.దళిత వ్యతిరేక బీజేపీ కార్యకర్తలు, ఎమ్మెల్యే మతోన్మాద అరాచక శక్తులకు అండగా నిలిచారని, దళిత మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆరుగురు దళిత మహిళలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.పోలీసులు దాడి చేసిన వాళ్లకు వత్తాసు పలకడంపై సీఎం స్పందించాలన్నారు. దళితులకు కేవీపీఎస్ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నదని, ప్రజాస్వామిక శక్తులు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యభద్రతకు తోడ్పాటు ‘ సీఎంఆర్‌ఎఫ్ ’



సీఎం సహాయ నిధి ఎల్వోసీ అందజేస్తున్న సుభాష్‌నగర్ మాజీ కార్పొరేటర్ జి.సురేశ్ రెడ్డి

జీడిమెట్ల : సీఎం సహాయ నిధి పేదల ఆరోగ్యభద్రతకు తోడ్పాటునిస్తుందని సుభాష్‌నగర్ మాజీ కార్పొరేటర్ జి.సురేశ్ రెడ్డి అన్నారు. ఎస్.ఆర్.నాయక్ నగర్ కాలనీకి చెందిన చిన్నారి డి. వశిష్ట అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ చిన్నారి సమస్యపై చలించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.10 లక్షల ఎల్వోసీను మంజూరు చేయించారు. ఆ చెక్కును బుధవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల ఆత్మబంధువు ఎమ్మెల్యే వివేకానంద్ అని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, శేషా చారి, అనిల్ కుమార్, విజయ్ కుమార్, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

దుండిగల్, మే 14 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ బుధవారం షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన స్వప్నకు రూ.15 వేలు, తమ్మాలి నర్సింహకు రూ.60 వేలు, మహేశ్ గౌడ్ రూ.60 వేలు ప్రభుత్వం మంజూరు చేయగా సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు శ్రీశైలం గౌడ్ అందజేశారు.

### కూకట్‌పల్లి రైతుబజార్‌లో
## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 14 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి.టమాట 15, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 48, కాకరకాయ 35, బీరకాయ 40, క్యాబేజి 13, ఫ్రెంచ్ బీన్స్ 115, క్యారెట్ 25, కాలీఫ్లవర్ 23, దొండ 23, చిక్కుడు 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 47, ఆలుగడ్డ 25, కీర 28, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 15, కందగడ్డ 65, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 18, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9నుంచి 11, చామగడ్డ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 25, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## బీఎఫ్ఏ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ) రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 27లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ. 500 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

## కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే ఊరుకోం..



ప్రభుత్వ భూముల్లో వెలిసిన నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దుండిగల్, మే 14: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, గండి మైసమ్మ – దుండిగల్ మండల పరిధిలోని, దుండిగల్ గ్రామం, సర్వే నం. 453,454 ప్రభుత్వం భూముల్లో కబ్జా భూముల్లో వెలసిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. ప్రభుత్వ భూములపై కన్నేసిన అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కొన్ని రోజులుగా అధికారులను తప్పుదోవ పట్టించి కబ్జాకు పాల్పడి రాత్రికి రాత్రి నిర్మాణాలను చేపట్టాడు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన తాసిల్దార్ మతిన్, సిబ్బంది వాటిని తొలగించాల్సిందిగా కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిబ్బంది బుధవారం వివేకానంద నగర్‌లోని ఆక్రమణలను జేసీబీ సాయంతో కూల్చి వేశారు. తాసిల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడితే ఊరుకోబోమన్నారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.



## సైబరాబాద్ సీపీ ఆకస్మిక తనిఖీ

దుండిగల్ : సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి బుధవారం సాయంత్రం సూరారం పోలీస్‌స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డ్‌లను పరిశీలించారు. పెండింగ్ కేసులపై సీఐ, ఎస్ .భరత్ కుమార్ ను అడిగి వాటిని త్వరగా ఇన్వెస్టిగేషన్ చేసి కంప్లీట్ చేయాలని ఆదేశించారు. సిబ్బంది పని తీరుని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి, మేడ్చల్ ఏడీ సీపీ పురుషోత్తం, ఏసీపీ సీహెచ్. శంకర్‌రెడ్డి, సీఐ ఎస్. భరత్ కుమార్, డీఐ సతీశ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## దూరవిద్య ఎంసీఏ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ కోర్సు రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.